

రోడ్డు ప్రమాదాల నివారణలో అందరి భాగస్వామ్యం అవసరం

శ్రీనివాస్, జిల్లా రవాణా శాఖ అధికారి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

జగిత్యాల రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలను పకడ్బందీగా అమలు చేస్తున్నాం. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని వర్గాల భాగస్వామ్యం అవసరమని, రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలు, ప్రభుత్వ లక్ష్యం మేరకు తీసుకుంటున్న చర్యలను 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో వివరించారు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో రవాణా శాఖ పరిస్థితి ఏమిటి..?

అధికారి: జిల్లాలోని తాటిపల్లి శివారులో రవాణా శాఖ జిల్లా కార్యాలయంతో పాటు జగిత్యాల, కోరుట్లలో ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయాలు పనిచేస్తున్నాయి. ఐదుగురు ఎంవీఐలు, ఇతర సిబ్బంది నిరంతరం నిఘా ఏర్పాటు చేసి వాహనాల వినియోగంలో అక్రమాలను నిరోధించడానికి అవసరమైన చర్యలు ఎప్పటికప్పుడు తీసుకుంటున్నాము.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ లక్ష్యం మేరకు ఆదాయం సాధిస్తున్నారా..?

అధికారి: లక్ష్యానికి మంచి ఆదాయాన్ని సాధిస్తున్నాము. ఎప్పటికప్పుడు వాహన తనిఖీలు నిర్వహించడం, నిబంధనలు పాటించని వాహన యజమానులను గుర్తించి రుసుము వసూలు చేస్తున్నాము. ట్రాఫిక్ నిబంధనలను, రవాణ శాఖ నిబంధనలు పాటించాలని అవగాహన కల్పిస్తున్నాము.

ఆంధ్రజ్యోతి: కాలం చెల్లిన వాహనాలను నిరోధించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

అధికారి: కాలం చెల్లిన వాహనాల పట్ల స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాము. నిబంధనలు ఉల్లంఘించిన వాహన యజమానులకు జరిమానా వేయడం, కేసులు నమోదు చేయడం, ఆర్సీ రద్దు చేయడం వంటివి చేస్తున్నాము. ఇప్పటివరకు 2,740 కాలం చెల్లిన వాహనాల ఆర్సీలను రద్దు చేశాము. 17 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వాహనాలను గుర్తిస్తున్నాము.

రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

జగిత్యాల అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని జగిత్యాల మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి అన్నారు. శనివారం పట్టణంలోని 13, 43 వార్డులలో రూ.20 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో ఏడేళ్ల క్రితం వేసిన రహదారులన్నీ గుంతలమయంగా మారాయని, ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే కోట్లాది రూపాయలు వెచ్చించి రహదారులు, డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణాలను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్లు అసియ సుల్తానా, ఫిర్దోస్ బేగం, శరణ్, నాయకులు కమల్, నదీమ్ పాల్గొన్నారు.

నలంద డిగ్రీ కళాశాలలో టాస్క్ క్యాంపస్ డ్రైవ్

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20న జిల్లాలో మొట్టమొదటిసారిగా టాస్క్ క్యాంపస్ డ్రైవ్ ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేష్ తెలిపారు. ఇందులో ప్రముఖ ఇండియన్ లోకల్ సెర్చ్ ఇంజన్ కంపెనీ జస్ట్ డయల్ వారు 100 మందికి ఉద్యోగాలు ఇవ్వడానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో 2024లో డిగ్రీ పూర్తిచేసిన, ప్రస్తుతం 2025లో డిగ్రీ పూర్తిచేసుకోబోతున్న అబ్బాయిలు అందరూ పాల్గొనవచ్చునని టాస్క్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా రిలేషన్‌షిప్ మేనేజర్ గంగ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపాద నరేష్ తెలిపారు.

సేవలకు గుర్తింపు..



- ఆర్టీసీలో ప్రతీ నెల ఉత్తమ ఉద్యోగులకు సత్కారం
- ఇంధన పొదుపు, ఆదాయం పెంపుపై దృష్టి
- పోటీతత్వం పెంచేలా కార్యక్రమాలు
- డ్రైవర్లు, కండక్టర్లకు ప్రోత్సాహకాలు

జిల్లాలో ఇలా..

ఆర్టీసీ డిపో	బస్సులు	కండక్టర్లు	డ్రైవర్లు	ఇతర సిబ్బంది
జగిత్యాల	62	128	137	140
మెట్‌పల్లి	55	97	91	49
కోరుట్ల	62	96	88	48
మొత్తం	179	321	316	237

జగిత్యాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సిబ్బంది ఉత్తమ పనితీరు కనబరిచేలా జిల్లాలో అధికారులు తగిన ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంధన పొదుపు, ఆదాయ పెంపుపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. ఇందుకు కృషి చేసిన డ్రైవర్లు, కండక్టర్లకు ప్రతి నెల ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. కండక్టర్లు, డ్రైవర్లతో పాటు సిబ్బందిలో పోటీతత్వాన్ని పెంచుతున్నారు. ప్రజారవాణా వ్యవస్థలో కీలక పాత్ర ఆర్టీసీ పోషిస్తోంది. కోవిడ్ తదనంతరం ఆదాయం గణనీయంగా తగ్గిపోవడం, నష్టాలు అధికమయ్యాయి. సంస్థను లాభాల బాట పట్టించేందుకు అధికారులు అనేక చర్యలు చేపట్టారు. ఇంధన పొదుపు, సంస్థకు అధిక ఆదాయం తెచ్చే పది మంది సిబ్బందిని గుర్తించి ప్రతి నెలా ప్రశంస పత్రాలు అందజేయడంతో పాటు శాలువలతో సత్కరిస్తున్నారు. జిల్లాలో ఉన్న జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్టీసీ డిపోలో ప్రత్యేక కార్యక్రమాలు కొంత కాలంగా కొనసాగుతున్నాయి. తద్వార ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఆర్టీసీ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.



కోరుట్లలో ప్రశంస పత్రాలు అందుకున్న ఉద్యోగులు

పకడ్బందీగా...

ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, సూపర్‌వైజర్ల పనితీరును నిశితంగా పరిశీలిస్తున్నారు. గతంలోనే ఈ విధానం ఉన్నప్పటికీ, గతేడాది జూన్ నుంచి పకడ్బందీగా అమలు చేస్తున్నారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్టీసీ డిపోల పరిధిలో విజయవంతంగా అమలు చేస్తున్నారు.

మిగతా 8వ పేజీలో

లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా నిర్వహించాలి



సర్వే వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

- రేషన్‌కార్డుల సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్ బీఎస్ లత
- అధికారులకు పలు సూచనలు

8

అధ్వానంగా లింగంపేట రైల్వేస్టేషన్ రోడ్డు

- ఇరుకు రోడ్లతో అవస్థలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

8



పగుళ్లు తేలిన రైల్వే స్టేషన్ రహదారి

ముగిసిన నవోదయ పరీక్ష



పరీక్ష కేంద్రాలను సందర్శించిన డీఈవో రాము

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. నవోదయ జేఎన్‌విఎస్‌టి-2025 జిల్లాలో 10 కేంద్రాల్లో నిర్వహించగా 2229 మంది విద్యార్థులకుగానూ 1598 మంది హాజరైనట్లు డీఈవో రాము తెలిపారు. పరీక్ష సందర్భంగా 6 కేంద్రాలను సందర్శించారు.

వెల్గటూర్ : వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్ష కేంద్రంలో 237 మంది విద్యార్థులకు గాను 198 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఎంఈవో ప్రభాకర్ తెలిపారు. 11 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించారు. చీఫ్ సూపరిండెంట్‌గా వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు నందయ్య, సెంట్రల్ లేవెల్ ఆఫీసర్‌గా రాజ్‌కుమార్‌లు విధులు నిర్వహించారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ తుంగూరి సుచిత్ర శనివారం ప్రకటనలో తెలిపారు. 5 తరగతిలో మైనార్టీ విద్యార్థులకు 60సీట్లు, ఇతరులకు 20 సీట్లు అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ ఒక్కో గ్రూప్‌కి 30 సీట్లు మైనార్టీలకు, ఇతరులకు 10 సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు జనవరి 18 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 7332170846, 7569927878, 9492210317 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

త్వరలో రైతు భరోసా

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.21 వేల కోట్ల రుణమాఫీ అమలు చేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమని, అలాగే త్వరలో రైతు భరోసా కూడా పంపిణీ చేస్తామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలో 69 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.18 లక్షల చెక్కులను, 108 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని, అలాగే అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉండేలా జగిత్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్‌లు మహిపాల్ రెడ్డి, సందీప్‌రావు, తహసీల్దార్‌లు శ్రీనివాస్, రామ్మోహన్, ఏఎంసీ మాజీ చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు, నాయకులు నక్కల రవీం దర్‌రెడ్డి, సురేందర్ రావు, బాల ముకుందం, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్ఈ

ఇటీవల రోడ్లు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా నియమితులైన కిషన్ రావు శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే ఇటీవల మున్సిపల్ డీఈగా నియమితులైన రాజేశ్వర్ రావు ఎమ్మెల్యేను వారి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

పద్మశాలి విద్యార్థులకు చేయూతనందించాలి

మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ నరహరి ఐఏఎస్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సెక్రెటరీ నరహరి, నాయకులు

జగిత్యాల అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా పోపా క్యాలెండర్‌ను మధ్యప్రదేశ్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలీలకు తోడ్పాటును అందిస్తూ, పద్మశాలీల ఐక్యతకు తోడ్పడాలని సూచించారు. అలాగే జగిత్యాల పోపా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలపై ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు. జగిత్యాల పోపా పద్మశాలీల అభ్యున్నతికి కృషి చేయాలని, పేద పద్మశాలి విద్యార్థులకు చేయూతనందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోపా జిల్లా అధ్యక్షుడు కొక్కుల రాజేష్, గౌరవ అధ్యక్షుడు ఏవీఎన్ రాజు, ఆర్థిక కార్యదర్శి మచ్చ శంకర్, పద్మశాలి రాష్ట్ర నాయకులు బోగ వెంకటేశ్వర్లు, బోగ ప్రవీణ్ పాల్గొన్నారు.

పసుపు బోర్డు ఏర్పాటుతో బహుళ ప్రయోజనాలు

జగిత్యాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిజామాబాద్ కేంద్రంగా పసుపు బోర్డు ఏర్పాటు చేయడంతో బహుళ ప్రయోజనాలు అందనున్నాయని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. శనివారం జగిత్యాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించడంతో పాటు పూల మాలలు, శాలువలతో సత్కరించారు.

ఈ సందర్భంగా గంగారెడ్డి మాట్లాడారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రత్యేక కృషితో కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డును ఏర్పాటు చేసిందన్నారు. పసుపు బోర్డు తొలిచైర్మన్‌గా తనను నియమించడం సంతోషకరమన్నారు. పసుపు బోర్డు ఏర్పాటు వల్ల పసుపునకు గిట్టుబాటు ధర రావడంతో పాటు పసుపు అనుబంధ పరిశ్రమలు ఏర్పడే అవకాశాలున్నాయని, పసుపు ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజీ సెంటర్లు ఏర్పాటు చేసే అవకాశాలున్నాయన్నారు. పసుపు రైతులు కొన్ని దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పసుపు బోర్డు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

కార్యక్రమంలో జగిత్యాల పట్టణ బీజేపీ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, నాయకులు ఇట్నేని రమేశ్, పెద్ద గంగారాం, సుంకెట దశరథరెడ్డి, నలువాల తిరుపతి పాల్గొన్నారు.



జాతీయ పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డిని సత్కరిస్తున్న జగిత్యాల బీజేపీ నాయకులు

ప్రధాని, ఎంపీ చిత్ర పటాలకు క్షీరాభిషేకం

ఇబ్రహీంపట్నం: నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం ఇబ్రహీంపట్నం పసుపు రైతులు ప్రధాని నరేంద్రమోదీ, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రైతు సంఘం నాయకులు బద్దం శ్రీనివాస్‌రెడ్డి, ఎలిసే పాపన్న, మహిళా రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సీఐ వేణు గోపాల్

జగిత్యాల క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నియమ నిబంధనలపై నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, హెల్మెట్ ధరించాలన్నారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలపై రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ట్రాఫిక్ ఎస్సై మల్లేశం,ఉన్నారు.

క్రీడా పోటీలకు ఆహ్వానం

జగిత్యాల అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) భారత ప్రభుత్వం2024-25 సంవత్సరానికి నిర్వహించే జాతీయ సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలలో పాల్గొనే అభ్యర్థులు జిల్లా యువజన క్రీడా శాఖ కార్యాలయంలో సంప్రదించాలని యువజన క్రీడా శాఖాధికారి రవికుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తిగల వారు ఈ నెల 21వ తేదీలోగా కలెక్టర్ కార్యాలయంలోని యువజన క్రీడల శాఖ కార్యాలయంలో సంప్రదించవలసిందిగా ఆయన పెర్కొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎన్టీఆర్

జిల్లా వ్యాప్తంగా ఘనంగా వర్ధంతి



ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

రాయికల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి, తెలుగు జాతి ఉన్నంతవరకు తరతరాలుగా గుర్తుండిపోయే మహోన్నత వ్యక్తి స్వర్గీయ నందమూరి తారక రామారావు అని టీడీపీ జగిత్యాల నియోజకవర్గ అడహక్ కమిటీ సభ్యులు సోమ నారాయణ రెడ్డి అన్నారు. రాయికల్ పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల తెలుగుదేశం పార్టీ జెండా వద్ద స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. మోర గణేష్, నామని లక్ష్మీనర్సయ్య, ఎండీ సాహెబ్ హుస్సేన్, కల్లెడ రాజరెడ్డి, నాయిని రాజేందర్ గౌడ్, వడ్లకొండ నరేష్, రమేష్ పాల్గొన్నారు.

జగిత్యాల అర్బన్: దివంగత మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు కలియుగ పురుషుడని టీడీపీ జిల్లా నాయకులు అక్కినపల్లి కాశీనాథం అన్నారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతిని పురస్కరించుకుని జగిత్యాల టవర్ సర్కిల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ నాయకులు సోమనారాయణరెడ్డి, విట్టల్, శ్రీధర్, భార్గవ్‌రామ్, కొండయ్య, రాజేశం, తిరుపతి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కోరుట్ల: నందమూరి తారక రామారావుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే భారత రత్న ప్రకటించాలని టీడీపీ రాష్ట్ర నాయకుడు, తెలుగు దేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మానుక ప్రవీణ్ కుమార్ కోరారు. శనివారం పట్టణంలోని అయ్యప్ప గుట్ట ప్రాంతంలోని టీడీపీ కార్యాయలంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సీహెచ్ నర్సింగం, పాతర్ల విజయ్ కుమార్, గజ్జెల్లి రాజాగణేష్, కటకం మహదేవ్, బాలే మారుతి, రాజా నరేందర్, ఎంఏ నదీం, అసిఫ్, సిద్దు, తెలుగు మహిళ నాయకురాలు దివ్వ, విజయ్, పద్మ, మాలాశ్రీ, జ్యోతి, శాంత, అంజలి, రాణి, కళ్యాణి, సోని పాల్గొన్నారు.

మల్లాపూర్ : పలువురు పార్టీ నాయకులతో కలిసి మల్లాపూర్‌లో ఎన్టీఆర్ చిత్ర పటానికి కోరుట్ల నియోజకవర్గ టీడీపీ నాయకులు మానుక ప్రవీణ్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ జరిపారు.

మెట్‌పల్లి : పట్టణంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మానక ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ అసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు ఎండీ సాదుల్లా, కటుకం మహదేవ్, గంగులు, గణేష్, వినయ్, రాజేష్‌లు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: టీడీపీ మాజీ మండలాధ్యక్షులు గుజ్జుల రమేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. టీడీపీ నాయకులు శ్రీనివాస్, సత్యం, ప్రభాకర్, గంగాధర్, భూమన్న పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలో టీడీపీ నాయకులు ఉప్పుల రామకిష్టయ్య ఆధ్వర్యంలో నంది విగ్రహ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన వేడుకల్లో భాగంగా కార్యకర్తలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. టీడీపీ నాయకులు తిరుమన్‌దాసు శ్రీనివాస్, రాజశేఖర్, పుల్లయ్యశాస్త్రి, తిరుమన్‌దాసు సత్యనారాయణ పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండల కేంద్రంలోని అంగడి బజారులో మండల టీడీపీ నాయకులు ఎన్టీఆర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గుర్రం నర్సాగౌడ్, టీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కర్ణాచారి పాల్గొన్నారు.

ముగిసిన 'నవోదయ' ప్రవేశపరీక్ష

చొప్పదండి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాలలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 6,806 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 5,064 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 1,742 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 74.4శాతం మాత్రమే పరీక్ష రాశారు. పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపాల్ మంగ తాయారు తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన కలెక్టర్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్‌యూ పీజీ పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, జనవరి18 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల రుసుమును జనవరి 29లోపు చెల్లించాలని యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగప్రసద్ ఒక ప్రకటనలో తెలిపారు. 2016-2017 సంవత్సరం కోర్సుల్లో చేరిన వారికి ప్రత్యేక రుసుముతో ఒకసారి అవకాశం కల్పించినట్టుగా తెలిపారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షలు నియంత్రణ అధికారి సూచించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

మేడిపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రంగాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.13,820 స్వాధీనం చేసుకున్నారు. సమాచారం మేరకు దాడి చేసి ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కరీంనగర్ రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుబ్బపల్లిలో శనివారం సివిల్ సప్లయిస్ అధికారులు దాడి చేసి మూడు క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టుకున్నారు. స్థానికుల ఫిర్యాదు మేర కు సాగర్ అనే వ్యక్తి ఇంట్లో డిప్యూటీ తహసీల్దార్ సురేందర్, ఇన్‌స్పెక్టర్ మధు తనిఖీ చేశారు. ఇంట్లో నిల్వ ఉంచిన మూడు క్వింటాళ్ల రేషన్‌బియ్యం స్వాధీనం చేసుకుని సాగర్‌పై కేసు నమోదు చేశారు.



భారత మహిళల ఖోఖో జట్టుతో నరేశ్

గ్రామ స్థాయి నుంచి.. జాతీయ స్థాయికి..

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నిరంతర సాధన, కఠోర శ్రమతో భారతదేశ ఖో..ఖో.. జట్టుకు కోచ్‌గా శిక్షణను అందిస్తూ అందరి మన్ననలను అందుకుంటున్నాడు ఉమ్మడి జిల్లాకు చెందిన ఇస్లావత్ నరేష్. గతంలో క్రీడాకారుడిగా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించాడు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బంజరుపల్లి తండాకు చెందిన ఇస్లావత్ నరేష్ ఖో ఖో క్రీడా కారుడిగా అంచెలంచెలుగా ఎదిగి భారత మహిళల ఖో ఖో జట్టుకు శిక్షకుడిగా ఎంపికయ్యాడు. ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలో జరుగుతున్న మొదటి ప్రపంచ కప్ ఖో ఖో పోటీల్లో భారత మహిళల జట్టుకు కోచ్‌గా సేవలందిస్తున్నాడు. నరేష్ హుస్నాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడు. అతడి ప్రతిభను గుర్తించిన వ్యాయామ ఉపాధ్యాయుడు కె సదానందం ఖో ఖోలో శిక్షణ అందించాడు.

● జాతీయ స్థాయిలో పతకాలు



సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ ఖో ఖో క్రీడా అకాడమీ కోచ్‌లు అతడికి అకాడమీలో ప్రవేశం కల్పించారు. 2000-2002 సంవత్సరం వరకు నరేష్ అకాడమీలో శిక్షణ పొందుతూ ఇంటర్ విద్యను పూర్తి చేశాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి 2002లో హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో నరేష్ పాల్గొన్నాడు. 2004లో తెలంగాణ రాష్ట్ర సీనియర్స్ ఖో ఖో జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి పంజాబ్ రాష్ట్రంలో జరిగిన జాతీయ పోటీల్లో రాష్ట్ర జట్టుకు కాంస్య పతకం సాధించి పెట్టాడు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో 30 జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడం విశేషం.

● భారత మహిళా ఖోఖో జట్టు కోచ్‌గా రాణిస్తున్న నరేశ్

● స్పోర్ట్స్ కోటాలో రైల్వేలో ఉద్యోగం

ఖో ఖో క్రీడాకారుడిగా ప్రతిభ చాటుతూ 2004లో స్పోర్ట్స్ కోటాలో రైల్వేలో ఉద్యోగం సాధించాడు. 2009లో ఉత్తరప్రదేశ్‌లో జరిగిన జాతీయ ఖో ఖో పోటీల్లో సీనియర్స్ రైల్వే జట్టులో పాల్గొని బంగారు పతకం సాధించడంలో ముఖ్య పాత్ర పోషించాడు. 2015లో బెంగళూరు ఎన్ఐఎస్ సెంటర్‌లో కోచ్‌గా శిక్షణ పూర్తి చేసి 2016లో సౌత్ సెంట్రల్ రైల్వే జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా విధులు నిర్వహించాడు. 2018 నుంచి ఇప్పటి వరకు తెలంగాణ సీనియర్స్ రాష్ట్ర జట్టుకు కోచ్‌గా వ్యవహరి స్తున్నాడు. 2024 రైల్వే సౌత్ సెంట్రల్ జట్టుకు, భారత రైల్వే జట్టుకు కోచ్‌గా వ్యవహరించాడు.



ఇస్లావత్ నరేశ్

● ప్రపంచ కప్‌లో..

2024 మహారాష్ట్రలోని పూణేలో జరిగిన అల్టిమేట్ ఖో ఖో పోటీల్లో చెన్నై క్విక్ గన్స్ జట్టుకు నరేష్ కోచ్‌గా వ్యవహరించి పలువురి మన్ననలను అందుకున్నాడు. అనంతరం ఖో ఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నరేష్‌ను ప్రపంచకప్‌లో పాల్గొనే భారత మహిళల జట్టుకు కోచ్‌గా నియమించింది. దీంతో నరేష్ 30 రోజుల పాటు ఢిల్లీలో ఉండి భారత మహిళా జట్టుకు శిక్షణను అందించాడు. ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలో జరుగుతున్న ప్రపంచ కప్ ఖో ఖో పోటీల్లో నరేష్ తన సేవలను అందిస్తూ అందరి ప్రశంసలను అందుకుంటున్నాడు.

కొండగట్టు ఈవోగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌రావు

మల్యాల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ఈవోగా టి.శ్రీకాంత్‌రావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఈవో రామకృష్ణరావు హైదరాబాద్‌లోని గణేష్ టెంపుల్‌కు బదిలీ కాగ ఆయన స్థానంలో వేములవాడ ఈవో వినోద్ ఇన్నాళ్లు ఇన్‌చార్జీగా విధులు నిర్వహించారు. వరంగల్‌లో విధులు నిర్వహిస్తున్న ఎండో మెంట్ డిప్యూటి కమిషనర్ టి.శ్రీకాంత్‌రావును ఈ నెల 7న కొండగట్టు ఈవోగా నియమించడంతో శనివారం విధుల్లో చేరారు. అంతకు ముందు నూతన ఈవో స్వామి వారి సన్నిధిలో పూజలు నిర్వహించి దేవస్థానం పరిసరాలు పరిశీలించారు. కొండపై అధికారులతో కలసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ దేవస్థానం అభివృద్ధికి కృషి చేయనున్నట్లు పేర్కొ న్నారు. ఆక్రమణకు గురవుతున్న భూముల వివరాలు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు చంద్రశేఖర్, సునీల్, హరిహరనాథ్ పాల్గొన్నారు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈవో శ్రీకాంత్‌రావు



ధర్మపురిలో మాట్లాడుతున్న ఏపూరి సోమన్న

ఎస్సీ వర్గీకరణ పోరాటానికి కదిలి రావాలి

ధర్మపురి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ కోసం పోరాటం చేసేందుకు ప్రతీ ఒక్కరు కదిలి రావాలని ప్రముఖ కళాకారుడు, ప్రజా యుద్ధ నౌక ఏపూరి సోమన్న పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే వేయి గొంతుకలు, లక్ష డప్పులు మాదిగల మహా ప్రదర్శన కోసం ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సోమన్న మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణ కోసం మాదిగలు నిర్వహించే పోరాటానికి ప్రతీ ఒక్కరు మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ నిర్వహించే పోరాటానికి అడ్డుపడే స్వార్థపరుల కుట్రలను మాదిగ జాతి తిప్పికొట్టాలన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మూడు దశాబ్దాలుగా చేస్తున్న వర్గీకరణ పోరాటానికి మద్దతు ప్రకటించి ముందుండాలన్నారు. అంతకు ముందు ఆయన అంబేద్కర్ విగ్రహానికి, చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో వేయి గొంతుకలు, లక్ష డప్పులు రాష్ట్ర కో ఆర్డినేటర్ ఒల్లాల వాణి, జిల్లా కో ఆర్డినేటర్ ప్రముఖ కళాకారులు రామంచ భరత్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సురుగు శ్రీనివాస్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం, ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి చిర్ర లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్, రాష్ట్ర నాయకులు రాజమల్లయ్య, లక్ష్మణ్, అమూల్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తిమ్మాపూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామం వద్ద రాజీవ్ రహదారిపై బైకుపై వెళుతున్న వ్యక్తిని వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన గోలి చంద్రారెడ్డి(59) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై తన పొలం వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో కొత్తపల్లి స్టేజీ వద్ద ఉదయం హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వెళుతున్న (ఏపీ09సీ డబ్ల్యూ0014) కారు వేగంగా బైక్‌ను ఢీకొట్టింది. చంద్రారెడ్డి రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. చంద్రారెడ్డి భార్య గోలి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



చంద్రారెడ్డి(ఫైల్)

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ..

జగిత్యాల క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ మహిళ శుక్రవారం రాత్రి మృతి చెందింది. పట్టణంలోని బేడబుడగ జంగాల కాలనీకి చెందిన తుర్పాటి తిరుపతమ్మ(40) అనే మహిళ ప్రధాన రహదారి దాటు తుండగా కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ ఢీ కొట్టాడు. దీం తో తిరుపతమ్మకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే తిరుపతమ్మ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తిరుపతమ్మ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సుల్తానాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని రాజీవ్ రహదారి పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కరీంనగర్‌కు చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై పెద్దపల్లి నుంచి కరీంనగర్ వెళ్తున్నాడు. అదే సమయంలో సుల్తానాబాద్ శ్రీరాంనగర్‌కు చెందిన అబ్దుల్ కరీం అనే వ్యక్తి సైకిల్‌పై వస్తుండగా ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కిందపడి గాయపడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

ఎండపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపానికి గురై మండలానికి చెందిన ఓ యువకుడు శనివారం ఉదయం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెల్గటూర్ ఎస్ఐ ఉమాసాగర్ వివరాల ప్రకారం.. ఎండపల్లికి చెందిన మానుపాటి రమేశ్ (38)కు 20 ఏళ్ల క్రితం చొప్పదండి మండలం వెదురుకట్ట గ్రామానికి చెందిన పద్మతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నేళ్లుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. 2017లో పద్మ తన భర్త రమేశ్‌పై వరకట్నం కేసు కూడా పెట్టింది. రమేష్ కొన్ని రోజులు భార్యతో వెదురుకట్టలో కలిసి ఉన్నాడు. తమ సొంత గ్రామమైన ఎండపల్లికి వెళ్లి ఉందామని భార్యను అడగగా ఆమె అంగీకరించలేదు. దీంతో రమేశ్ ఒక్కడే సొంత గ్రామానికి వెళ్లి ఉంటున్నాడు. నాలుగు నెలలుగా రమేశ్ మానసిక పరిస్థితి సరిగ్గా ఉండడం లేదు. భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి లచ్చవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉరేసుకొని యువతి..

కోనరావుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం గోవిందరావుపేట తండాకు చెందిన యువతి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గోవిందరావుపేట తండాకు చెందిన బానోతు గంగోత్రి (23) ఫిట్స్, మతిస్థిమితం లేక బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చూపించిన నయం కాలేదు. పది రోజులుగా విపరీతమైన తలనొప్పితో బాధపడుతోంది. ఆరోగ్యం బాగా లేకపోవడంతో జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం దూలానికి ఉరేసుకుంది. గంగోత్రి తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

బీరు బాటిల్‌లో రబ్బర్ ముక్క

జగిత్యాలరూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జగిత్యాల అర్బన్ మండలంలోని ధరూర్‌లో గల ఓ వైన్స్ దుకాణంలో శనివారం మధ్యాహ్నం ఓ బీర్ బాటిల్‌లో రబ్బరు ముక్క గమనించిన కొనుగోలుదారుడు వైన్స్ యజమానులను ప్రశ్నించాడు. పలువురు యవకులు ఓ వైన్స్‌లో ఆర్‌సీ బీర్లను కొనుగోలు చేసి చూడగా బీర్‌లో రబ్బర్ ముక్క రావడంతో అవాక్కయ్యారు. వెంటనే కొనుగోలుదారుడు వైన్స్‌కి వచ్చి నిర్వాహకులను ప్రశ్నించాడు. దీంతో వైన్స్ నిర్వాహకుడు పొంతనలేని సమాధానాలు చెప్పడమేకాకుండా బాధ్యతారహితంగా వ్యవహరిం చారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు విచారణ జరిపి సదరు వైన్స్‌పై చర్యలు తీసుకోవాలని కోరాడు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో జట్టు సత్తా చాటాలి

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు సత్తా చాటాలని మేయర్ సునీల్‌రావు అన్నారు. శనివారం కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి బాలుర హ్యాండ్‌బాల్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. క్రీడాకారులు లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని సూచించారు. తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో హ్యాండ్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను జాతీయస్థాయిలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నామన్నారు. కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసవని లక్ష్మణ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మూడు రోజులపాటు రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలను నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీ ల్లో 10 ఉమ్మడి జిల్లాల నుంచి 200మంది క్రీ డాకారులు, 50 మంది అధికారులు పాల్గొంటున్నారని అన్నారు. వీరందరికీ మూడు రోజుల పాటు ఉచిత వసతి సౌకర్యాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, డీవైఎస్ఓ శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ పరిశీలకులు దీపక్ ప్రసాద్, జుంజుపల్లి వివేక్, జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆనంద్ కుమార్, నెమలికొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేష్, జిల్లా సంఘ కోశాధికారి కనకయ్య, రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘ రెప్రిస్ బోర్డు కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

● అనుమానాస్పదుడిగా భావించి దాడి చేసిన స్థానికులు

వేములవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద వ్యక్తిగా భావించి స్థానికులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డ ఓ యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ నెల 15వ తేదీ బుధవారం తెల్లవారుజామున వేములవాడ పట్టణంలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా జెండా వెంకటాపురం గ్రామానికి చెందిన ఎనుకూరి రాజేందర్ (27) అనే యువకుడు ఈనెల 15వ తేదీ తెల్లవారుజామున తన స్నేహితులతో కలిసి రాజరాజేశ్వర స్వామి దర్శనం కోసం బైక్‌పై వస్తూ దారితప్పి భగవంతరావునగర్‌లోని తాటికొండ రాజయ్య ఫంక్షన్ హాల్ వైపునకు వెళ్లారు. ఆ సమయంలో అక్కడే ఉన్న కొందరు యువకులు వారిని అడ్డగించి ఎవరంటూ ప్రశ్నించారు. సమాధానం చెప్పేందుకు తడబడడంతో దొంగలుగా భావించిన స్థానికులు చితకబాదారు. తాము ఫలానా చోట పనిచేస్తున్నామని చెప్పిన వినకుండా విచక్షణారహితంగా చితక బాదారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన రాజేందర్‌తోపాటు మరొకరిని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. నాలుగు రోజులుగా వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజేందర్ శనివారం మృతి చెందినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. పదేళ్ల కింద తల్లిదండ్రులను కోల్పోయిన రాజేందర్ పనులు సరిగా లేకపోవడంతో జీవనోపాధి కోసం మామిడి తోటలో పనిచేసేందుకు 15 రోజుల క్రితమే వేములవాడకు వచ్చాడని తెలుస్తోంది. ఇదిలా ఉండగా అనుమానాస్పద వ్యక్తులుగా భావిస్తూ స్థానిక యువకులు కొందరు విచక్షణారహితంగా దాడికి దిగి ఒకరి మృతికి కారణమైన ఘటనను పోలీసు శాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ దాడిలో పాలుపంచుకున్న యువకుల వివరాల కోసం సీసీ ఫుటేజీని పరిశీలించామని, నిందితులను గుర్తించామని, వారిని పట్టుకునేందుకు గాలింపు చేపట్టామని పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రాజేందర్(ఫైల్)

సంచలనాలకు చిరునామా బడే చొక్కారావు

మంథని, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో తూర్పు అడవుల్లో విప్లవోద్యమాన్ని ఉరకలెత్తించిన మావోయిస్టు రాష్ట్ర పార్టీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ మల్లన్న మూడు రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృత్యువాత పడ్డారు. ఎన్‌కౌంటర్‌లో దామోదర్ మృతి చెందినట్లు మావోయిస్టు పార్టీ అధికారికంగా శనివారం ప్రకటన విడుదల చేఇంది. మంథని నియోజకవర్గ సరిహద్దుకు సమీపంలో ఉన్న ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్ యువకుడిగా ఉన్నప్పుడే మావోయిస్టుల్లో చేరారు. తొలుత ఏటూరు నాగారం దళంలో సభ్యుడిగా పని చేసిన చొక్కారావు మహదేవపూర్-ఏటూరు నాగారం ఎల్‌జీఎస్ కమాండ్‌గా నియమితుల య్యారు. ఈక్రమంలోనే మహదేవపూర్ పోలీసుస్టేషన్‌ను బస్సు బాంబ్‌తో పేల్చి వేసిన ఘటనలో కీలక పాత్ర పోషించారు. కాటారంలో ఫారెస్టు గెస్టుహౌజ్, ఎంపీడీవో ఆఫీసులను పేల్చివేయడం, పోలీసు ఇన్‌ఫార్మర్ల పేరుతో అనేక మంది పై దాడులు, కొందరిని చంపిన సంఘటనలు, పలు ఎన్‌కౌంటర్లలో తృటిలో తప్పించుకున్నారు. ఉమ్మడి జిల్లాలో నితూర్పు డివిజన్‌కమిటీ కార్యదర్శిగా, ఖమ్మం-కరీంనగర్-వరంగల్ (కేకేడబ్ల్యూ పీ) కమిటీ కార్యదర్శిగా, జయశంకర్ భూపాలపల్లి-ములుగు-వరంగల్-పెద్దపల్లి (జేఎండబ్ల్యూపీ) కమిటీ అధికార ప్రతినిధిగా పనిచేశారు. మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ గా గత ఏడాది జనవరి నెలలోనే బడే చొక్కారావును పార్టీ కేంద్ర కమిటీ నియమించింది. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో ఆయన మృతి చెందారు. దీంతో దామోదర్ 30 ఏళ్ల విప్లవోద్యమ జీవితం ముగిసింది.



బడే చొక్కారావు అలియాస్ దామోదర్(ఫైల్)

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ చోరీ



కాపర్‌వైరు చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

గంగాధర, జనవరి 18 (ఆంధ్రజ్యో తి): గంగాధర మండలం ఉప్పరమ ల్యాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పరమల్యాలో వ్యవసాయ సాగు పంపు మోటర్ల కోసం ఎస్ఎస్ 15 నంబరు గల 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ను విద్యుత్ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు నాలుగు బావుల మోటర్లు నడుస్తుంటాయి. కాగా శుక్ర వారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందపడేసి అందులోని కాప ర్ వైరును ఎత్తుకెళ్లారు. ఉదయం పొలానికి నీరు పెట్టడానికి వచ్చిన రైతులు మోటర్ ఆన్ చేయగా కరెంటు సరఫరా లేదు. ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు కొట్టేసి ఉంటుందనే అనుమానంతో అక్కడికి వెళ్లి చూశారు. ట్రాన్స్‌ఫార్మర్ కిందపడేసి ఉండడంతో విషయాన్ని ఏఈ రాంమోహన్‌కు తెలియజేశారు. ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తు న్నామని ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం

● చికిత్సపొందుతూ యువకుడి మృతి

ముత్తారం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతారం గ్రామానికి చెందిన బండ రామకృష్ణ (32) అనే యువకుడు ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బండ రామకృష్ణ అనే యువకుడు పెయింటింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పనిలో డబ్బులు రాకపోవడంతో అప్పులపాలయ్యాడు. దీంతో ప్రతిరోజు ఇంట్లో కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తొమ్మిదో తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య మానస, కుటుంబసభ్యులు మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది.. పుష్య మాసం సందర్భంగా క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. గోదావరిలో భక్తులు స్నానాలు ఆచరించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్ కుమార్, రాజగోపాల్ పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో భక్తుల పూజలు

మల్యాల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. జగిత్యాల ఆర్డీవో మధుసూధన్ కుటుంబసమేతంగా అంజన్నను దర్శించుకున్నారు

● కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో కొండగట్టు అంజన్న సన్నిధికి వచ్చె భక్తుల సౌకర్యార్థం ఆరు సిమెంట్ బెంచీలను అందజేశారు. ట్రస్టు నిర్వహకులు గంగిశెట్టి జగదీశ్వర్ పాల్గన్నారు.



కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తులు



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ఎ వజీర్

ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

గణేశ్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ 1535 సెంట్రల్ అధ్యక్షుడు వజీర్ అన్నారు. శనివారం యూనియన్ కరీంనగర్ రీజియన్ మొదటి జనరల్ బాడీ సమావేశం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించారు. కొత్తగా యూనియన్‌లోకి వచ్చిన కార్మికులను ఆయన ఆహ్వానించారు. ఈసందర్భంగా వజీర్ మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని, ఈపీఎఫ్ టు జీపీఎఫ్ అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో రీజినల్ సెక్రెటరీ జమీరుద్దీన్ సిద్ధికి, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, కోశాధికారి నాగేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, నగేష్, శ్రీనివాస్, మూర్తి, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

● కరీంనగర్ జైలులో 'మై నేషన్' బ్రాండ్‌తో ఉత్తత్తి
● ఆలయాల్లో పూజకు వాడిన పూల వినియోగం
● త్వరలో పూర్తిస్థాయి ఉత్పత్తి



మై నేషన్ అగరబత్తుల పాకెట్‌ను కలెక్టర్ పమేలా సత్పతికి అందిస్తున్న జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా

వేస్ట్ టు వెల్త్ కింద అగరు బత్తుల తయారీ



కరీంనగర్ క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా జైలులో అగరు బత్తీల తయారీని జైళ్ల శాఖ ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ఆలయాల్లో వాడిన పూలతో జైలులోని ఖైదీలతో ఈ అగరు బత్తీల తయారీని చేపట్టింది. ఈ జైలులో ఇప్పటికే ఫర్నిచర్ ఇండస్ట్రీ, ఫినాయిల్, మాస్కుల తయారీలతోపాటు నర్సరీ, మై నేషన్ పేరిట కరీంనగర్‌లో రెండు పెట్రోల్ బంక్‌లను నిర్వహిస్తున్నారు. జిల్లా జైలులో 300కు పైగా ఖైదీలు ఉన్నారు. వారికి జైలులో వివిధ వృత్తుల్లో శిక్షణ ఇస్తూ విడుదల అయిన తరువాత వారు సొంత కాళ్లపై నిలబడి ఉపాధి పొందేందుకు మార్గం చూపుతున్నారు. కొందరు ఖైదీలు జైలులోనే స్టీల్ ఫర్నీచర్ ఇండస్ట్రీ, నర్సరీ, మాస్కుల తయారీ, ఫినాయిల్ తయారీతో ఉపాధి పొందుతున్నారు. తాజాగా అగరు బత్తీల తయారీని చేపట్టారు. అగరు బత్తీల తయారీకి ప్రధానంగా ముడి సరుకు పూలు..



● తయారీ ఇలా..

ఆలయాల్లో ఉపయోగించిన పూలు, భక్తులు సమర్పించే పూల దండలు, వ్యాపారుల వద్ద వాడిపోయిన పూలను జైలు సిబ్బంది నిత్యం సేకరిస్తారు. ఆ పూలను శుభ్రపరచి వారం రోజులపాటు ఆరబెడతారు. ఎండిన పూలను పొడిగా మార్చి అగరు బత్తీలుగా తయారు చేస్తారు. మార్కెట్‌లో లభించే అగరు బత్తీలు బొగ్గు, ఇతర రసాయాలతో తయారు చేస్తుంటారు. జైలులో తయారు చేసే అగరుబత్తీలు సహజసిద్ధంగా పూలతో తయారు చేస్తుండడం, ఎలాంటి రసాయనాలు ఉపయోగించరు. వీటికి మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందని జైలు అధికారులు అంచనా వేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో దేవుడికి ఉపయోగించి తొలగించిన పూలతో టీటీడీ అగరు బత్తీల తయారీని చేపట్టింది. ఇదే స్ఫూర్తిగా తీసుకుని జైళ్లశాఖ కరీంనగర్ జిల్లా జైలులో మొట్టమొదటిసారిగా అగరుబత్తీల తయారీకి శ్రీకారం చుట్టింది.

ఈ పూలను దేవాలయాల నుంచి సేకరించాలని జైళ్ల శాఖ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు కరీంనగర్ జిల్లా జైలులో అగరు బత్తీల తయారీకి అవసరమైన పూలను వేములవాడ, స్థానిక ఆలయాలు, పూల వ్యాపారుల నుంచి సేకరించాలని నిర్ణయించారు. ఈ మేరకు వేములవాడ ఆలయం, స్థానికంగా ఉన్న వివిధ ఆలయాలతోపాటు పూలవ్యాపారులతో చర్చించారు.

● 'మై నేషన్' అగరు బత్తుల విడుదుల

మై నేషన్ బ్రాండ్ పేరుతో ఎన్విరాన్‌మెంటల్ ఫ్రెండ్లీ ఫ్లవర్ ఇన్‌సెన్స్ స్టిక్స్‌ను జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి శనివారం విడుదల చేశారు. కరీంనగర్ జిల్లా జైలులో జరిగిన ఒక కార్యక్రమంలో మై నేషన్ అగరుబత్తీల ప్యాకెట్లను మార్కెట్‌లోకి విడుదల చేస్తూ మొదట అధికారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తయారీ విధానాన్ని డీజీ పరిశీలించారు. అనంతరం జైలులో ఖైదీలకు అందిస్తున్న వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐజీ మురళిబాబు, డీఐజీ ఎం సంపత్, జైలు సూపరింటెండెంట్ కె శ్రీనివాస్, వైద్య అధికారి కె వేణుగోపాల్, జైలర్లు పి శ్రీనివాస్, బి రమేష్, యు పరుశరాం, డిప్యూటీ జైలర్లు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ సుధాకర్‌రెడ్డి, ఎల్ రమేష్, ఎస్ అజయ్‌చారి, ఎన్ సంగీత, సిబ్బంది పాల్గొన్నారు.



అగరు బత్తీలను పరిశీలిస్తున్న జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా

ఇంటర్నెట్ సేవలు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి



టీవీ ఫైబర్‌ను పరిశీలిస్తున్న ఎండీ వేణుప్రసాద్

ముత్తారం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిముత్తారంలో నాణ్యమైన ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని టీ ఫైబర్ సంస్థ ఎండీ వేణుప్రసాద్ అధికారులను ఆదేశించారు. గత నెల ఇంటింటికి ఇంటర్నెట్ పైలెట్ ప్రాజెక్టు కింద అడవి శ్రీరాంపూర్ గ్రామాన్ని ఎంపిక చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్‌బాబు ఆదేశానుసారం శనివారం అడవి శ్రీరాంపూర్ గ్రామాన్ని టీఫైబర్ ఎండీ వేణుప్రసాద్ సందర్శించారు. ఇంటింటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఎలా జరుగుతుంది.. నాణ్యతలో ఏమైనా లోపాలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వేణుప్రసాద్ గ్రామంలో అంతరాయం లేకుండా నాణ్యమైన ఇంటర్నెట్ మరియు టీవీ సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దోడ్డ బాలాజి, అధికారులు ప్రణవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలోకి ఒరిగిన లారీ

మంథని, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫెర్టిలైజర్స్ భారీ లోడుతో ఉన్న లారీ స్థానిక అంబేద్కర్ చౌక్‌లో ప్రధాన రహదారిలో ఉన్న డ్రైనేజీలో శనివారం దిగబడింది. షాప్ వద్ద అన్‌లోడ్ చేయటానికి వెళ్తున్న క్రమంలో రోడ్డు కింది భాగంలో ఉన్న డ్రైనేజీ పైకప్పు అధిక బరువు కారణంగా పగిలిపోయి వెనుక భాగం టైర్లు అందులో దిగబడి పోయాయి. దీంతో ఒక్కసారిగా లారీ ఎడమవైపు పూర్తిగా వంగిపోయింది. పక్కన రోడ్డుపై ఉన్న పూలబండిలపై ఒరిగింది. కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈసమయంలో అక్కడే ఉన్న పూల షాపుల నిర్వాహకులు, ప్రజలు, వాహనదారులకు ప్రమాదం తప్పింది. పోలీసులు వచ్చి లారీని, ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు.

అటవీ భూములను సంరక్షించాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 18 (ఆంధ్ర జ్యోతి) : మండలంలో సర్వే చేపట్టి అటవీ, ప్రభుత్వ భూములను సంరక్షించాలని గ్రామాల్లోని ప్రజలు డిమాండ్ చేశారు. శనివారం మెట్‌పల్లి ఫారెస్ట్ అధికారులు షౌకత్ అలీ, అరుణ్ కుమార్, చైతన్యశ్రీలకు మాజీ ఎంపీపీ పాలెపు నీలమ్మ ఆధ్వర్యంలో ఆత్మ కూర్, ఆత్మనగర్ గ్రామాల్లోని ప్రజలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల చుట్టూ ఉన్న వంద ల ఎకరాల్లో ఉన్న అటవీ భూములను కొందరు అక్రమదారులు చెట్లను తొలగించి చదును చేసుకుంటూ కబ్జా లకు పాల్పడుతు న్నారన్నారు. అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా సంరక్షించి మొక్కలు నాటాలన్నా రు. త్వరలోనే గ్రామాల్లో పర్యటించి భూము లను సంరక్షించాలని అధికారులను కోరామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామాల్లోని నాయకులు చౌటుపల్లి అంజయ్య, నేరెళ్ల శ్రీధర్, కేసీరెడ్డి నవీన్‌రెడ్డి, శ్రీనివాస్, రాజారెడ్డి, పాల్గొన్నారు.

కల్వర్టుపై నీటి ప్రవాహం

» గుంతలు పడి ప్రమాదకరంగా మారిన వంతెన



కల్వర్టుపై నుంచి పారుతున్న నీటిలో నుంచి వెళుతున్న వాహనదారులు

కోనరావుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో లో లెవెల్ వంతెన నిత్యం నీరు పారుతుండడంతో వరద తాకిడికి గుంతలు ఏర్పడి కల్వర్టు ప్రమాదకరంగా మారింది. సిరిసిల్ల నుంచి కోనరావుపేట మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో కొన్నేళ్ల క్రితం నిర్మించినలో లెవెల్ వంతెనపై మల్కాపేట రిజర్వాయర్ నీరు నిత్యం ప్రవహిస్తోంది. వర్షాకాలంలోనూ వరద ఉధృతి ఎక్కువ. దీంతో లో లెవెల్ వంతెన కొట్టుకుపోయి గుంతలుగా మారింది. రోజు నీరు ప్రవహిస్తుండడంతో గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమా దాలకు గురవుతు న్నారు. అధికారులు పాలకులు స్పందించిలో లెవెల్ కల్వర్టుకు నిధులు మంజూరు చేయాలని, హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

అపస్మారక స్థితిలోకి డ్రైవర్

● ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



డ్రైవర్‌ను పరామర్శిస్తున్న డీఎం

మెట్‌పల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. టీజీ 02 యూబి 0228 నెంబర్ గల బస్సు మెట్‌పల్లి నుంచి రాయికల్ వెళ్తుండగా పాత బస్టాండ్ వద్ద డ్రైవర్ సతీష్ ప్రయాణికుల కోసం బస్సును ఆపాడు. ఉన్నట్టుంది ఒక్కసారిగా డ్రైవర్ అపస్మారక స్థితిలోకి వెళ్లి సీట్‌పై పడిపోయాడు. గమనించిన ప్రయాణికులు వెంటనే డ్రైవర్‌ను అంబులెన్స్‌లో ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. తినకపోవడం వల్ల నీరసం వచ్చి కళ్లు తిరిగి పడిపోయినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న డీఎం దేవరాజు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి డ్రైవర్‌ను పరామర్శించారు. ప్రస్తుతం డ్రైవర్ పరిస్థితి నిలకడగా ఉందని, మరో డ్రైవర్‌ను ఏర్పాటు చేసి ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చారు.



త్యాగరాజ స్వామి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



పంచరత్న గానం వినిపిస్తున్న శ్రీవిద్య బృందం

వైభవంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

వేములవాడ కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామిక్షేత్రంలో త్యాగరాజస్వామి 72వ ఆరాధనోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఆరాధనోత్సవాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. అంతకు ముందు ఆలయ అర్చకులు తెల్లవారు జామున ఉదయం 5.45 గంటలకు స్వస్తి పుణ్యాహవాచనము నిర్వహించారు. ఉదయం 7.25 గంటలకు త్యాగరాజస్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి నగర సంకీర్తన చేపట్టారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్ సూపరింటెండెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహేష్ ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి జీవిత చరిత్ర విశేషాలు వివరించారు. ఉదయం 10.30 గంటలకు శ్రీవిద్య బృందం పంచరత్న గానం, భాస్వంత్ శర్మ చేసిన సంగీత కచేరి అలరించాయి.



కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

వేములవాడ కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న త్యాగరాజస్వామి వారి ఆరాదనోత్సవాల్లో భాగంగా కళాకారులు నిర్వహించిన కచేరీలు, కూచిపూడి నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. శనివారం రాత్రి 8 గంటలకు బో గ ధర్మరాజు బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన అలరిం చింది. కళాకారులను ఆలయ ఈవో వినోద్‌రెడ్డి సన్మానించారు.



భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

బీర్‌పూర్ తహసీల్దార్ ముంతాజొద్దిన్



బీర్‌పూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తమదృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాము. మండలంలో భూ సంబంధమైన సమస్యలు వచ్చినప్పుడు వెంటనే స్పందించి తక్షణ పరిష్కారం కోసం చర్యలు తీసుకొంటున్నాము. ఎవరికైనా సమస్యలు ఉంటే నేరుగా తమను సంప్రదించి సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ముంతాజొద్దిన్ ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

ఆంధ్రజ్యోతి: భూ సంబంధమైన సమస్యలకు తీసుకుంటున్న చర్యలు ఏంటీ?

తహసీల్దార్: తమ దృష్టికి వచ్చిన ప్రతి భూ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నాము.

ఆంధ్రజ్యోతి: మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మీ దృష్టికి వచ్చిందా.?

తహసీల్దార్: అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేశాము. ఇటీవల ఇసుక డంపులు గుర్తించి స్వాధీనం చేసుకొని వేలం వేశాము. ఇక మీదట అక్రమ ఇసుక రవాణ జరుగకుండా తగు చర్యలు తీసుకుంటున్నాము.

ఆంధ్రజ్యోతి: మండలంలో మీరు గుర్తించిన ప్రధాన సమస్యలు ఏంటి. వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు...?

తహసీల్దార్: మండలంలో ప్రస్తుతానికి ప్రధాన సమస్యలు ఏమీ లేవు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నాము.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెగడపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెగడపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ నరేష్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని నామాపూర్‌లో పద్మపాణి సొసైటీ కరీంనగర్ వారి సహకారంతో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

అధ్వానంగా లింగంపేట రైల్వేస్టేషన్ రోడ్డు

- ఇరుకు రోడ్లతో అవస్థలు....
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

జగిత్యాలరూరల్, జనరవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంగా ఏర్పడిన జగిత్యాలకు సమీపంలో గల లింగంపేట రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు కనీస రహదారి లేదు. దీంతో పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీస రవాణా సౌకర్యంలేక పోవడంతో రైలు ఉన్నా ప్రయాణించలేని పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు.

నిధులు కేటాయింపులేక...

జగిత్యాల పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలో లింగంపేట శివారులో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి కరీంనగర్, నిజామాబాద్, ముంబై, హైదరాబాద్‌లకు వెళ్తుంటారు. ఈ స్టేషన్ నుంచి కాచిగూడ, సిర్పూర్ కాగజ్‌నగర్ పుష్‌పుల్ రైళ్లు నడుస్తున్నాయి. వారానికి ఒక రోజు ముంబయికి ఎక్స్‌ప్రెస్ రైలు నడిచినప్పటికీ ఈ మధ్యనే నిలి పివేశారు. స్టేషన్ వెళ్లాలంటే రవాణ సౌకర్యం లేదని, ప్రత్యేకంగా ఆటోలో వెళ్తేరూ.250,నుంచి రూ. 300 వరకు ఛార్జి తీసుకుంటున్నారని ప్రయాణికులు చెబుతున్నారు. మరోవైపు నిజామాబాద్ రహదారి మీదుగా హస్నాబాద్ నుంచి స్టేషన్‌కు వెళ్లాలంటే ఇరుకు రోడ్డు మాత్రమే ఉంది. ఈ రహదారిని 100 అడుగులతో రెండు వరసల రహదారి చేయాలని ప్రతిపాదన ఉన్నప్పటికీ నిధులు కేటాయించడం లేదు. బీట్ చౌరస్తా నుంచి లింగంపేట మీదుగా స్టేషన్ వెళ్లాలన్న గతుకుల రోడ్డు కావడంతో స్టేషన్ ఉన్నా నిరుపయోగంగా మారుతోంది.

విస్తరణ చేపడితేనే మేలు..

జిల్లాకు వచ్చే యూరియా, డీఏపీతోపాటు బియ్యం, సోయా, మామిడికాయల రవాణాకు ఈ స్టేషనే ప్రధానం. హస్నాబాద్ నుంచి సింగిల్ రోడ్ లోనే లారీలు వెళ్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాకాలంలో లారీలు రోడ్డుపై దిగపడి పోయి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ ప్రాంతం అభివృద్ధి సాధించాలంటే స్వప్న దాబా నుంచి స్టేషన్ వరకు రెండు వరుసల దారి నిర్మాణం, బీట్ చౌరస్తా నుంచి లింగంపేట మీదుగా రెండు వరుసల రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఆయా నిర్మాణాలు పూర్తిచేసి ఆర్టీసీ బస్సులు నడిపించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. రెండు వరుసల రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతూ నిజామాబాద్ నేషనల్ హైవేపై లింగంపేట, హస్నాబాద్, అంబారిపేట గ్రామస్థులు, రైతులు ఆందోళనకు పలుమార్లు ఆందోళనకు దిగారు. అయితే హస్నాబాద్ మీదుగా రెండు వరసల రహ దారి నిర్మాణం త్వరలోనే పూర్తిచేస్తామని.. అంతర్గాం మీదుగా రెండు వరసల రహదారికి కృషి చేస్తామని ఎమ్మెల్యే సంజయ్ తెలిపారు.



గుంతలమయంగా మారిన రైల్వే స్టేషన్ రహదారి

కార్మిక సంక్షేమ చట్టాలను.. సద్వినియోగం చేసుకోవాలి

సీనియర్ సివిల్ ప్రధాన న్యాయమూర్తి నాగేశ్వర్‌రావు..

మెట్‌పల్లి రూరల్, జనవరి, 18 (ఆంధ్రజ్యోతి) : దినసరి కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక సంక్షేమ చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ మెట్‌పల్లి ప్రధాన న్యాయమూర్తి నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు ఆవరణలో మండల లీగల్ సేల్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి అధ్యక్షతన నిర్వహించారు. ప్రధాన న్యాయమూర్తి నాగేశ్వర్‌రావును మార్కెట్ కమిటీ యార్డు చైర్మన్ కూన గోవర్ధన్ శాలువతో సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ రాజ్యాంగములో కార్మికుల కోసం అనేక రకాల సంక్షేమ చట్టాలు రూ పొందించామన్నారు. వివిధ రంగాలకు చెందిన హమాలి, భవన నిర్మాణ ఆటో వివిధ రంగాలకు చెందిన కార్మికులు సంక్షేమ చట్టాలను ఉపయోగించుకొని లబ్ధి పొందాలని కోరారు. కార్మికులు ఇన్స్‌రెన్స్ డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందాలన్నారు. కార్మికులు మద్యానికి బానిసలు కావద్దని, తమ పిల్లలను మంచిగా చదివించి ఉన్నత శిఖరాల కు తీసుకువెళ్లాలని కోరారు. కార్మికులకు కోర్టు పరంగా ఏవైనా అవసరాలు ఉంటే నేరుగా సంప్రదించాలని ఉచితంగా న్యాయసేవలు అందజే స్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాములు, సీఐ నిరంజన్‌రెడ్డి, లేబర్ అధికారి కృష్ణసాగర్, న్యా యవాదుల సంఘం అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్, ఉపాధ్యక్షుడు రాం బాబు, ప్రధాన కార్యదర్శి వేణు, న్యాయవాదులు, కార్మికులు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు

సేవలకు గుర్తింపు..

(5వ పేజీ తరువాయి)

ఇంధన పొదుపు చేసిన డ్రైవర్లు, అత్యధిక టిక్కెట్లు విక్రయించిన కండక్టర్లు ఉత్తమ పనితీరు కనబరిచిన మెకానిక్‌లు, సూపర్‌వైజర్లను ప్రతి నెల గుర్తిస్తున్నారు. వారిని ప్రోత్సహించడానికి ప్రశంస పత్రాలను అందిస్తున్నారు. డిపోల వారీగా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, ఎంపిక చేసిన 10 మంది సిబ్బందికి బ్యాడ్జీలు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్నారు. మూడు నెలలు, ఆరు నెలలు, ఏడాది ఇలా రీజనల్, జోనల్ రాష్ట్ర స్థాయిలో సిబ్బంది ప్రతిభను గుర్తిస్తున్నారు. ప్రతిభను నిరూపించుకునేందుకు ఉద్యోగులు పోటీ పడుతుండటంతో సంస్థ ఆదాయం పెరుగుతున్నట్లు చెబుతున్నారు.

● విజయవంతంగా అమలు...

టి దేవదాసు, ఆర్టీసీ డీఎం, మెట్‌పల్లి

ఆర్‌టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాలతో ఇంధన పొదు పు, ఆదాయం పెంపు కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నాం. అత్యుత్తమంగా పని చేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సూపర్‌వైజర్లను ప్రతి నెల గుర్తించి సన్మానిస్తున్నాం. తద్వారా ఉద్యోగుల్లో కనిపించే నిరూపించుకోవాలనే తపన సంస్థ అభ్యున్నతికి తోడ్పడుతుంది.

● పోటీతత్వం పెంపొందుతుంది

సునీత, ఆర్టీసీ డిపో మేనేజర్, జగిత్యాల

ఉత్తమమైన ప్రతిభను కనబరిచిన కండక్టర్లు, డ్రైవర్లు ఇతర సిబ్బందికి ప్రతీనెల ప్రశంసపత్రాలు అందించడం, సత్కరించడం వల్ల ఉద్యోగుల్లో పోటీ తత్వం పెంపుందుతోంది. తద్వారా సంస్థను లాభాల బాటన నడిపించడానికి ప్రయత్నిస్తున్నాము. దీంతో పాటు చురుకుగా పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందిని గుర్తించడం, వెనుకబడిన ఉద్యోగులు, సిబ్బందిని సైతం గుర్తించి తగిన విధంగా ప్రోత్సహించడానికి వీలు కలుగుతోంది.

ఆలయానికి వెండి పూజా సామగ్రి అందజేత

కోరుట్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన అల్లె శ్రీనివాస్-లలిత దంపతులు అయ్యప్ప ఆలయానికి వెండి పూజా సామగ్రిని ఆలయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్‌కు అందించారు. సుమారు రూ. 65,000 విలువ గల 590 గ్రాముల వెండి సామగ్రిని ముట్టజెప్పారు. దాతలను కమిటీ సభ్యులు సన్మానించారు. ఆలయ అభివృద్ధికి మాన్వారా రాజశేఖర్ - అనూష, శైలేందర్-శ్రావ్య దంపతులు రూ. 21,116 నగదును కమిటీ సభ్యులకు అందించారు.

దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కొడిమ్యాల, జనవరి 18(ఆంధ్రజ్యోతి) : చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవి శంకర్ ఇంటిపై రెండు రోజుల క్రితం దాడికి యత్నించిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని మండల బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే ఇంటిపై దాడి యత్నాన్ని ఖండిస్తూ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రాజకీయ నాయకులకు, విమర్శలు, ప్రతి విమర్శలు ఉండాలి కాని దాడులకు దిగటం సరైనది కాదన్నారు. రవిశంకర్ దళితుడు అయినందునే దాడి చేశారన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలను అభివృద్ధి చేశాడన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పులి వెంకటేష్ గౌడ్, నాయకులు లక్ష్మారెడ్డి, కొత్తూరి స్వామి, అంజన్‌కుమార్, శరత్, ఆనందం, వెంకటి, చంద్రమొహన్, మల్లయ్య, లక్ష్మన్, చందు, బాబు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

కోరుట్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండలం సిరిపూర్ గ్రామానికి చెందిన ఎన్ లక్ష్మి కుటుంబ సభ్యులకు శనివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు సీఎం సహాయ నిధి చెక్కును అందించారు. పట్టణంలోని జువ్వాడి భవనంలో లక్ష్మి కుటుంబ సభ్యులకు వైద్య చికిత్స కోసం సీఎం సహాయ నిధి నుండి మంజూరయిన రూ. 1.50 లక్షల విలువ గల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నేమూరి భూమయ్య, సుద్దు అమృత, సురేందర్, నల్ల బాపు రెడ్డి నల్ల శ్రీనివాస్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందిస్తున్న జువ్వాడి కృష్ణారావు

హామీలు నెరవేర్చలేదని పోస్టులు పెడితే అక్రమ కేసులా?

ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని సోషల్ మీడియాలో పోస్టులు పెడితే అక్రమ కేసులతో తమను ఇబ్బందులకు గురిచేయడం అక్రమ కేసులు పెట్టడం అప్రజాస్వామికం అని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. నర్సింగాపూర్ గ్రామానికి చెందిన గంగారెడ్డి సోషల్ మీడియాలో కళ్యాణలక్ష్మీతో పాటు తలుం బంగారం ఏమైందని చేసిన పోస్టుకు గానూ పోలీసులు పోస్టును తీసివేయాలని ఇబ్బంది పెట్టారని ఆరోపిస్తూ జిల్లా పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు, ఆరు గ్యారంటీలపై సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తే అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేయడాన్ని పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నాయకులు హరీష్, నీలి ప్రతాప్, మహేష్, చందు, జలందర్, రంజిత్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పంటల కోసమే గోదావరిలోకి నీటి విడుదల

బీర్‌పూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతుల పంటలకు సాగు నీరు అందించేందుకు గోదావరి నదిలోనికి టీఎంసీ నీటి విడుదల చేసినట్లు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం బీర్‌పూర్ మండలంలోని రేకులపెల్లి గ్రామంలో పర్యటించిన ఆయన గోదావరి నదిలోనికి విడుదల చేసిన టీఎంసీ నీటి వరదలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పంటలకు ఇబ్బందులు కలుగకుండ గోదావరి నదిలోనికి నీటిని విడుదల చేయించామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్‌లకు రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు జితేందర్ యాదవ్, లక్ష్మన్ రావ్, జోగి రెడ్డి, మల్లారెడ్డి, శంకర్, మోహన్ రెడ్డి, తిరుపతి, సుభాష్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మెట్‌పల్లిటౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా నేడు ఆదివారం డివిజన్ పరిధిలోని అన్ని మండలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మెట్‌పల్లి డీఈ గంగారాం ఒక ప్రకటనలో తెలిపారు. పెంబట్ల, కోనాపూర్ 220/132 కెవి సబ్‌స్టేషన్‌లో చేపడుతున్న లైన్ ఇన్, లైన్ ఔట్ టవర్ల నిర్మాణ పనులు ముగింపులో భాగంగా మెట్‌పల్లి డివిజన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. 132/33 కెవి సబ్ స్టేషన్ గోధుర్, కోరుట్ల, కథలాపూర్, పరిధిలో ఉన్న ఏడు గ్రామీణ మండలాలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సింగిల్ ఫేజ్ సరఫరా మాత్రమే ఉంటుందన్నారు. కోరుట్ల, మెట్‌పల్లి రెండు మున్సిపాలిటీలలో యధావిధిగా త్రీఫేజ్ ఉంటుందన్నారు. శనివారం రాత్రంతా త్రీఫేజ్ కరెంట్ ఉంటుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలి

ధర్మపురి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జగిత్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఆకుసాయిపల్లె గిరిజన గ్రామంలో టీకాలు వేసే కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య ఆరోగ్య శాఖ పక్షాన గ్రామంలో చేపట్టిన గర్భిణులు నమోదు, షుగర్, బీపీ పేషంట్ల నమోదు చేస్తున్న సిబ్బందితో ఆయన మాట్లాడారు. అలాగే ఆకు సాయపల్లెలో ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట నేరెళ్ల పీహెచ్‌సీ హెచ్‌ఈవోలు సతీష్, వెంకటేష్, ఏఎన్ఎంలు రాణి, అంగన్‌వాడి టీచర్ కస్తూరి లక్ష్మి, ఆశావర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మల్లికార్జునస్వామి జాతర

కథలాపూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాండ్ర్యాలలో ఈ నెల 19న మల్లికార్జునస్వామి జాతరోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి భక్తులు కొండపైకి వచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. స్వామివారి కళ్యాణం పండితులు నిర్వహిస్తారని భక్తులు వీక్షించి తరించాలని కోరారు. మహిళలు స్వామివారికి బోనాలు సమర్పించుకుంటారని పేర్కొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

రాయికల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మాజీ ఎంపీటీసీ సోమిరెడ్డి సురేందర్ శనివారం ఇంగ్లీష్ స్టడీ మెటీరియల్ పుస్తకాలను అందజేశారు. విద్యార్థులు పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయుడు, ఇన్‌ఛార్జి బి.లక్ష్మయ్య, ఎ.శంకరయ్య, వినోద్, నరహరి, మల్లేష్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా నిర్వహించాలి

రేషన్ కార్డుల సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్ బీఎస్ లత

మెట్‌పల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రేషన్ కార్డు సర్వేలో లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత పెర్కొన్నారు. శనివారం పట్టణంలో ఆరపేట 5వ వార్డులో నిర్వహిస్తున్న రేషన్ కార్డు సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులకు, సర్వే సిబ్బందికి పలు సూచనాలు చేశారు. అమె మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలు పాటిస్తూ సర్వేను నిర్వహించాలని వేగవంతంగా సర్వే పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, కమిషనర్ మోహన్, తహశీల్దార్ శ్రీనివాస్, మేనేజర్ వెంకటలక్ష్మీ, ఆర్ఐ అక్షయ్, మెప్మా టీఎంసి సోమిడి శివ, ముజీబ్, పాల్గొన్నారు.



చౌలమద్దిలోని సర్వేను పరిశీలిస్తున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ లత

పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలి

మెట్‌పల్లి రూరల్: ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల, రైతు భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ లత అధికారులకు ఆదేశించారు. శనివారం మండలంలోని చౌలమద్ది గ్రామంలో చేపట్టిన ఇంటింటి సర్వేను మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్‌తో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామంలోని భూముల వివరాలను ఏఈవో నరేష్‌ను అడగా తెలపక పోవడంతో సర్వే పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కోసం నిబంధనలు పాటించాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్య దర్శి రవి, కారోబార్ రాములు, ఏఈవో నరేష్, ఎఫ్ఏ సరుష్, పాల్గొన్నారు.

మల్యాల: రేషన్‌కార్డుల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని జగిత్యాల ఆర్డీవో మధుసూధన్ అధికారులకు సూచించారు. మల్యాలలో శనివారం సర్వేను పరిశీలించారు. సర్వే వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ మునీందర్, ఈవో శ్రీకాంత్ ఉన్నారు. అన్ని గ్రామాల్లో అధికారులు సర్వే చేపట్టారు

కొడిమ్యాల : రేషన్‌కార్డుల సర్వేను గ్రామ కార్యదర్శులు పూర్తి పారదర్శకంగా చేయాలని జగిత్యాల ఆర్డీవో మదుసూధన్‌గౌడ్ అన్నారు. శనివారం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా, రేషన్‌కార్డుల సర్వేను మండలంలోని అప్పారావుపేట, నాచుపల్లి, కొడిమ్యాల గ్రామాల్లో ఎంపీవో టీం సర్వే చేస్తుండగా జగిత్యాల ఆర్డీవో అకస్మికంగా పరిశీలించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ రమేష్, ఏవో జ్యోతి, డీటీ కిరణ్ కుమార్, ఆర్ఐ కరుణాకర్, ఉన్నారు.

పెగడపల్లి : ఆహార భద్రత కార్డుల సర్వే కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలని పెగడపల్లి ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌లు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆహార భద్రత కార్డుల సర్వే కార్యక్రమాన్ని అధికారుల బృందం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

మల్లాపూర్: మండలంలో జరుగుతున్న ఆయా పథకాల ఇంటింటి సర్వేను శనివారం మల్లాపూర్ రెవెన్యూ అధికారులు పరిశీలించిన్నారు. వాల్గొండలో జరుగుతున్న సర్వేను డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, గిర్దవర్ సురేష్ బృందం పరిశీలించి సూచనలు చేశారు.

స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన వైద్యాధికారి

జగిత్యాల అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని పలు స్కానింగ్ కేంద్రాలను మాతా శిశు సంరక్షణాధికారి జైపాల్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. స్కానింగ్ మిషన్ల నంబర్లను పరిశీలించిన ఆయన దరఖాస్తు సమయంలో మిషన్లనే వాడాలని ఒక వేల కొత్తవి తీసుకు వస్తే వాటి వివరాలు రిజిస్ట్రేషన్ సరిఫికెట్‌లో నమోదు చేసుకోవాలని అన్నారు. ప్రతి నెల విదిగా ఫారం ఎఫ్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రతి నెల 5వ తేదీలోగా ఫారం ఎఫ్‌ను పట్టణంలోని ఆరోగ్య కేంద్రంలో సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పొఫెసర్‌లు కటుకం భూమేశ్వర్, శంకర్, రాజేశం పాల్గొన్నారు.

ఉపాధిహామీ ప్రజావేదిక

మల్యాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను శనివారం మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి, అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్ పాల్గొనగా గత ఏడాది కాలంలో మండలంలోని 19గ్రా మాలలో చేపట్టిన ఉపాధి పనుల తనిఖీ నివేదికపై జాబ్‌కార్డు దారుల నుంచి వివరాలు తీసుకున్నారు. ఈజీఎస్ కింద రూ. 4.57 కోట్లు, పీఆర్ కింద రూ.3.30కోట్ల పనులు చేపట్టగా రూ. 25,390 రికవరీకి అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డీఈవో దేవేంధర్‌రెడ్డి, ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ప్రవీన్, ఏపీవో శ్రీనివాస్, ఈసీ మనోజ్, సోషల్ ఆడిట్ ఎస్టీఎం అంజద్ అలీ, ఎస్సార్పీ సుశీల, టీఏలు జలపతిరెడ్డి, లావణ్య, పంచాయితీ కార్యదర్శులు, పీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



మల్యాలలో ప్రజావేదిక నిర్వహిస్తున్న డీపీవో

సంక్షిప్త సమాచారం

మల్లాపూర్ : మండలంలోని మొగిలిపేటలో సల్మాన్‌ఖాన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వారం రోజులుగా సాగుతున్న క్రికెట్ టోర్నమెంట్ శని వారం ముగిసింది. విజేతలకు స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ మాహబూబ్‌ఖాన్ తన స్వంత నిధులు వేచించి బహుమతు లు అందజేశారు.

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని దసరా గుట్టపైన గల ప్రహ్లాద లక్ష్మీ నృసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం నుంచి ఆలయంలోని ఉత్సవ మూర్తులను పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, అర్చనలు, పూజలు కార్యక్రమాలను బ్రహ్మశ్రీ గంగాప్రసాద్ దీక్షిత్ యాజ్ఞికంలో నంబి గోపాల కృ ష్ణశర్మ ఆధ్వర్యంలో ఆలయం ప్రధాన పురోహితులు నంబి మనోహర్‌శర్మ చేపట్టారు. పురోహితులు శ్రీ సుదర్శన నృసింహ మహాయాగం, శ్రీ చక్ర కుంకుమ పూజలు మంత్రోచ్ఛారణల మధ్య భక్తులచే ఘనంగా చేయించారు. పురోహితులు రాజగౌతం, శితి కంఠ, షణ్ముఖశర్మ, నంబి మనోహర్‌శర్మ, నంబి రాజేందర్‌శర్మ పాల్గొన్నారు.

మల్లాపూర్ : మల్లాపూర్ మండలంలోని వివిరావుపేట గ్రామంలో నర్సింగం స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ విజేతగా ఇటిక్యాల టీం గెలుపొంది. శనివారం గెలుపొందిన విజేతలకు నగదు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కోరుట్ల : సత్యసాయి సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా వ్యాస రచన పోటీలలో పట్టణంలోని మాస్టో విద్యార్థి ప్రతిభ కనపరిచి ప్రథమ స్థానంలో నిలిచినట్లు కళాశాల కరస్పాడెంట్ ఆకుల రాజేష్ శనివారం తెలిపారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా వ్యాసరచన పోటీలలో ఇంగ్లీష్ విభాగంలో పాల్గొన్న కళాశాల ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని మదిహ మహవీన్ ప్రతిభ కనపరిచి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాదించినట్లు రాజేష్ తెలిపారు. విద్యార్థిని మదిహ మహవీన్‌ను కళాశాల ఉపన్యాసకులు సన్మానించి అభినందించారు.

కథలాపూర్ : మండల బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన మల్యాల మారుతిని శనివారం జిల్లా బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ సన్మా నించారు. చింతకుంట గౌడ సంఘ సభ్యులతో కలిసి మారుతిని శాలువాలతో సన్మానించి పూల బొకే అందించారు.